పల్లె పండగతో ప్రగతికి శ్రీకారం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రూ.2.80 కోట్ల పనులకు భూమి పూజ



సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, గాలివీడు, చిన్నమండెం, న్యూస్‌టుడే: పల్లె పండగతో ప్రతి ఊరి ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం పల్లెపండగ పంచాయతీ వారోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఆయన పర్యటించి అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఆరు మండలాలకు రూ.10 కోట్లు విలువైన పనులు మంజూరు కాగా సోమవారం చిన్నమండెం మండలం పడమటికోన, బలిజపల్లిలో రూ.48 లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. గాలివీడు మండలం అరవీడు, దళితవాడ, కుమ్మరపల్లి, గోరాన్‌చెరువు, పందిళ్లపల్లె గ్రామాలల్లో రూ.కోటి నిధులతో చేపట్టిన అయిదు సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. లక్కిరెడ్డిపల్లి మండలం పందిళ్లపల్లె, దేవళంపల్లి, ఎగువ వడ్డెపల్లిలలో రూ.1.40 కోట్ల విలువైన సిమెంట్ దారుల పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం, మురుగు కాలువల ఏర్పాటుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రానున్న అయిదేళ్లల్లో పారిశుద్ధ్యం, తాగునీటి వసతి, రహదారుల నిర్మాణ పనులు ప్రతి గ్రామానికి కల్పిస్తామన్నారు. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈనాడు అన్నమయ్య

మంగళవారం అక్టోబరు 15, 2024

మద్యం దుకాణాలకు అతివల పోటీ

- మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి కుమార్తెకు అవకాశం
- మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి కుటుంబానికి సైతం

ఈనాడు, కడప

జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు పూర్తయింది. లాటరీ ద్వారా 111 దుకాణాలను కేటాయించారు. మహిళలూ కొన్ని దుకాణాలు దక్కించుకోవడం గమనార్హం. పలువురు మహిళలు దరఖాస్తు చేయగా లాటరీ ప్రక్రియకు సైతం హాజరయ్యారు. సిండికేట్ల ప్రయత్నాలు కొన్ని చోట్ల సఫలమయ్యాయి. నంద్యాల మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి కుమార్తె సన్నపురెడ్డి సుజల ఏకంగా అయిదు దుకాణాలను దక్కించుకున్నారు. చిన్నమండెంలో దుకాణాల సంఖ్య 14, 15, కలికిరిలో 100, 101, పీలేరులో 103లను లాటరీలో కేటాయించబడ్డాయి. సుండుపల్లెలో నాలుగింటిలో రెండు.. కె.సావిత్రి, ఎం.దేవిలు కైవసం చేసుకున్నారు. మదనపల్లెలో 68, 69 నంబరు గల దుకాణాలను పగడాల ఇందిర దక్కించుకున్నారు. బి.కొత్తకోట నగర పంచాయతీలో దుకాణం నంబరు 78 డి.రేవతి, వాల్మీకిపురంలో 94, 96లను ఎం.దీప, నందలూరులో 42ను విజయలక్ష్మి కైవసం చేసుకున్నారు. లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గండికోట ద్వారకనాథ్‌రెడ్డి తన కుటుంబ సభ్యుల పేరిట మూడు దుకాణాలను లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాల్లో దక్కించుకున్నారు. రాజంపేటలో వైకాపా నేతలు సైతం పోటీపడ్డారు. ఓ కౌన్సిలర్ దుకాణాన్ని చేజిక్కించుకున్నారు. మదనపల్లె, రాజంపేట, రాయచోటిలో సిండికేట్ వ్యవహారం నడిచింది. దుకాణాలు దక్కించుకున్న వారిపై సిండికేట్ కోసం ఒత్తిడి తీసుకురావడం కనిపించింది. కొందరు బృందంగా ఏర్పడి దరఖాస్తు చేయగా. . ఎవరికొచ్చినా భాగస్వామ్య వ్యాపారం చేయాలని నిర్ణయించారు. ఎక్కువ శాతం దుకాణాలు ఎన్డీఏ కూటమిలోని తెదేపా, జనసేన నేతలు, అనుచరులు దక్కించుకున్నారు. దుకాణాల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా జరిగింది.



లాటరీ తీస్తున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, ఆబ్కారీశాఖ అధికారులు

జెన్‌కో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఏపీ జెన్‌కో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకులు సోమవారం డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పోస్టుకార్డుల ద్వారా విన్నవించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ... కార్మికుల్లో అనేక మంది సుమారు 15 ఏళ్లుగా అతి తక్కువగా జీతాలతో పనిచేస్తున్నారని తెలిపారు. వారికి విద్యార్హత ఉన్నా అన్‌స్కిల్డ్ వేతనాలే ఇస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో ఇతర విద్యుత్తు సంస్థలతో పోలిస్తే ఏపీ జెన్‌కో కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కార్మికుల గ్రేడ్‌లో మార్పులు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కమ్మేసిన మేఘం

అధికార యంత్రాంగం అప్రమత్తం


తీవ్ర రూపం దాల్చనున్న తుపాను

రైల్వేకోడూరు, రాజంపేటలపై అధిక ప్రభావం



రైల్వేకోడూరు పట్టణంలో జలమయమైన జాతీయ రహదారి

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం జిల్లాను వణికిస్తోంది.. ఇది పశ్చిమ వాయువ్య దిశగా వెళ్తోంది. దీని ప్రభావంతో మంగళ, బుధవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. సోమవారం నుంచే జల్లులు మొదలయ్యాయి. పొంచి ఉన్న ముప్పుతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేకంగా టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులను అప్రమత్తం చేశారు.



- ఈనాడు, కడప, న్యూస్‌టుడే, రాయచోటి

జిల్లాలో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మండల, రెవెన్యూ డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి నిరంతరం సమీక్షించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. వాగులు, వంకలు, కాలువలు, నదులు, ఉపనదుల గట్టులను పరిశీలించి.. ఎక్కడైనా బలహీనంగా ఉంటే గుర్తించి అవి తెగిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు తమ పంట ఉత్పత్తులు జాగ్రత్త పర్చుకునేలా సమాచారం అందించాలన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని ప్రజలకు సూచించారు. వర్షపు నీరు రహదారులు, వంతెనలపై ప్రవహించే పక్షంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, సిబ్బందిని కాపలాగా ఉంచాలని ఆదేశించారు. వర్షాలతో తాగునీరు కలుషితం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. రాజంపేట, రైల్వేకోడూరు, నందలూరు, చిట్వేలి ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, మరింత ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. బలమైన గాలులు, వర్షాల కారణంగా విద్యుత్తు అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉందని, వెంటనే పునరుద్ధరణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.



రాయచోటిలోని మదనపల్లె రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

- తుపాను ప్రభావం జిల్లాపై స్పష్టంగా కనిపిస్తోంది. సోమవారం వేకువజాము నుంచే జల్లులు మొదలయ్యాయి. వేడిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లగా మారిపోవడంతో పాటు ఆకాశం మేఘావృతమైంది. వరి, టమాట, బొప్పాయి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. టమాట పంటకు మంచి గిట్టుబాటు ధర లభిస్తున్న సమయంలో తుపాను ముంచుకొస్తోంది. వైఎస్ఆర్ జిల్లా కంటే అన్నమయ్యపై తీవ్ర ప్రభావం పడనుంది. ప్రస్తుతానికి చెరువుల్లో నీరు లేనందున పెద్దగా ముప్పు ఉండకపోవచ్చు. గాలులతో అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉంది. మంగళ, బుధవారం బయట ప్రాంతాలకు వెళ్లకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఇది 24 గంటలూ పనిచేసేలా సిబ్బందిని నియమించారు.

ఆపదలో ఆదుకునే కంట్రోల్ రూమ్

చరవాణి : 08561- 293006

జాతీయ రహదారి... మడుగులా మారి



ఈ చిత్రం చూస్తున్నారు కదా... ఓ మోస్తరుగా వర్షం కురిస్తే చాలు కడప-రేణిగుంట జాతీయ రహదారిలో ఒంటిమిట్ట హరిత హోటల్ వద్ద వాన నీరు నిలుస్తోంది. ఒంటిమిట్ట నుంచి రాజంపేట వైపునకు వెళ్లే సమయంలో రోడ్డుకు ఎడమ వైపున నీటితో నిండిన ఈ ప్రాంతం మడుగును తలపిస్తోంది. పెద్ద వాహనాలు లారీలు, బస్సులు వెళ్లేటప్పుడు చక్రాల నుంచి నీరు పైకి ఎగిరి అటువైపు వస్తున్న ద్విచక్ర వాహనదారులు, బాటసారులపై పడటంతో బాగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంత ప్రజలు పలుమార్లు ఎన్.హెచ్ సాంకేతిక నిపుణుల దృష్టికి వెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సోమవారం కురిసిన వానతో నిలిచిన నీటి చిత్రమిది. **- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

ఆదాయంలో మదనపల్లె-1 డిపో ప్రథమం

పీలేరు, న్యూస్‌టుడే : ప్రజల సౌకర్యార్థం ఆదివారం ప్రత్యేక బస్సులు నడపడంతో వచ్చిన ఆదాయంలో మదనపల్లె-1 డిపో ప్రథమ స్థానంలో నిలచింది. మదనపల్లె-1 డిపో బస్సులు 40 వేల కిలోమీటర్లు తిరిగి రూ.17.89 లక్షల ఆదాయం, 83.82 ఓఆర్, కిలోమీటరుకు రూ.45.28 ఆదాయం వచ్చింది. పీలేరు డిపోలో 30 వేల కిలోమీటర్లు తిరిగి రూ.13.34 లక్షల ఆదాయం, 81.42 ఓఆర్, కిలోమీటరుకు రూ.44.91 ఆదాయంతో ద్వితీయ స్థానం, రాజంపేట 24 వేల కిలోమీటర్లు తిరిగి రూ.10.26 లక్షల ఆదాయం, 76.84 ఓఆర్, కిలోమీటరుకు రూ.43.59 ఆదాయంతో తృతీయస్థానం, మదనపల్లె-2 డిపో 29 వేల కిలోమీటర్లు తిరిగి రూ.12.24 లక్షల ఆదాయం, 76.41 ఓఆర్, కిలోమీటరుకు రూ.42.62 ఆదాయంతో నాలుగో స్థానం, రాయచోటి 38 వేల కిలోమీటర్లు తిరిగి రూ.15.87 లక్షల ఆదాయం, 73.75 ఓఆర్, కిలోమీటరుకు రూ.41.63 ఆదాయం వచ్చి చివరి స్థానంలో నిలచింది.

నియంత్రికను చూస్తే దిమ్మె తిరగాల్సిందే!



ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు దిమ్మె ఏర్పాటు చేయడం మనం చూసుంటాం... ఎర్రబల్లి పంచాయతీ కంటేవారిపల్లెలో మాత్రం సిమెంటు రింగులతో చేసిన తొట్టిని దిమ్మెగా చేసుకుని, దానిపై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై రోడ్డు పక్కనే రెండేళ్ల క్రితం కంటేవారిపల్లెలో ఏర్పాటైన కాలనీలో కొంత మేర పక్కా ఇళ్ల నిర్మాణం జరిగింది. ఇందులో భాగంగా విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు దిమ్మె నిర్మించకుండా రింగు సిమెంటు తొట్టెపై ఏర్పాటు చేశారు. రింగులు ఏమాత్రం కదిలినా ప్రమాదం తథ్యం. దీంతో ప్రమాదం పొంచి ఉందని, కంచె ఏర్పాటు చేయక పోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని చూడాలని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ అంశాన్ని విద్యుత్తుశాఖ ఏడీఈ సురేంద్ర నాయక్ దృష్టికి తీసుకెళ్లగా, సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, మదనపల్లె అర్బన్ (కురబలకోట)

డ్వాక్రా మహిళలకు ఆర్థిక భరోసా

సాంకేతిక శిక్షణ, తక్కువ వడ్డీకే రుణాలు

ఆహార ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటుకు తోడ్పాటు

అన్నమయ్య జిల్లా వివరాలివి...

- ఎస్‌హెచ్‌జీలు : 30,685
- సభ్యులు : 3,00,671
- గ్రామ సమాఖ్యలు : 1,037
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల లక్ష్యం 150
- అందించే రుణం : రూ.5 లక్షలు
- పరపతి లక్ష్యం : రూ.7.50 కోట్లు

కలికిరి గ్రామీణ, ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: అతివలు ఆర్థిక సాధికారిత సాధించాలని సంకల్పంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయం తీసుకొంది. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆహార ఉత్పత్తి పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్న ఔత్సాహిక అతివలకు అండగా నిలబడాలని ముందుకొచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి అడుగు పెట్టనున్న వనితలను వెన్నుతట్టి ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో సెర్ప్ ఉన్నతాధికారులు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. క్షేత్రస్థాయిలో అమలు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కేవీకేలో 1,258 మందికి శిక్షణ : గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళల స్వయం ఉపాధి కోసం కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం తోడ్పాటు అందిస్తోంది. కలికిరిలో కేవీకే ఏర్పాటు చేసినప్పటి నుంచి 12 ఏళ్ల వ్యవధిలో 1,258 మంది మహిళలకు వివిధ రకాల చేతి వృత్తులపై శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దారు. వీరంతా నిరుపేద, మధ్య తరగతి మహిళలు, డ్వాక్రాలాంటి పొదుపు సంఘాల్లో సభ్యులు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక చేయూత కార్యక్రమం ద్వారా వీరందరికీ ఉపాధి లభించనుంది. గతంలో టమాట విలువ ఆధారిత ఉత్పత్తులు, వివిధ రకాల పండ్ల ఉత్పత్తుల తయారీ, చీరలపై అద్దకం, ఎంబ్రాయిడరీ, అగరబత్తీల తయారీ, పుట్టగొడుగుల పెంపకం, రాగి, సజ్జ, జొన్న, కొర్ర, సామ, అరిక, ఊదలు, వరిగలు, అండుకొర్రలు, వంటి చిరుధాన్యాలతో బిస్కెట్లు, లడ్డూలు, మురుకులు, మిక్చర్, నిప్పట్లు, గవ్వలు, పకోడి, అల్పాహార పదార్థాలైన ఇడ్లీ, దోస, ఉప్మా, పూరీ, చపాతి, కిచిడీ తయారీపై శిక్షణ ఇచ్చారు. కేవీకే సహకారంతో వివిధ రకాలైన ప్యాకింగ్ మెటీరియల్, లేబులింగ్ ధ్రువపత్రం వంటి సాంకేతిక అంశాలను తెలుసుకుని అవలంబించడం ద్వారా ఆహార పదార్థాల నాణ్యత, నిల్వ కాలాన్ని పెంచుకోగలుగుతున్నారు. ఇందులో శిక్షణ పొందిన మహిళలు, యువకులు సొంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొంది వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోనున్నారు.



కేవీకేలో చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో శిక్షణ పొందుతున్న మహిళలు (పాత చిత్రం)

సాయం అందేదిలా...

ఈ జిల్లాలో మండలానికి అయిదు ఆహార ఉత్పత్తుల తయారు చేసే పరిశ్రమలను స్థాపించేలా డీఆర్‌డీఏ అధికారులు ప్రణాళికను రూపొందించారు. ఒక్కో యూనిట్‌కు రూ. అయిదు లక్షల వరకు రుణం ఇవ్వనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఔత్సాహిక అతివలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను 150 అందుబాటులోకి తీసుకొచ్చేలా ముమ్మర కసరత్తు జరుగుతోంది. ఈసారి రూ.7.50 కోట్లు వరకు పరపతి ఇవ్వనున్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా రుణం పొందిన ఆడపడుచుల నుంచి 13.5 శాతం, స్త్రీ నిధిలో 11 శాతం వడ్డీ రాబడుతున్నారు. అదే పీఎంఎఫ్ఎంఈలో పరపతి పొందిన వారి నుంచి 6 శాతం మాత్రమే వడ్డీ వసూలు చేస్తారు. ఈ రంగంలోకి అడుగు పెట్టనున్న అతివలను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది. నిర్వాహకులు విజయవంతంగా నిర్వహిస్తే మరికొందర్ని కూడా ఇటువైపు నడిపిస్తామని డీఆర్‌డీఏ జిల్లా అధికారి సత్యనారాయణ తెలిపారు. ఆర్థిక సాధికారితకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఆశాకిరణమై ఎంతోమంది ఉపాధికి ఊతమిచ్చి ఎంతగానో తోడ్పాటు అందిస్తాయని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి అతివలు ముందుకు రావాలని కోరారు. ఆహారశుద్ధి పరిశ్రమ రంగానికి మంచి భవిష్యత్తు ఉందన్నారు.

సాగునీటి పనులకు నిధులొచ్చాయ్

మరమ్మతులకు రూ.4.79 కోట్లు మంజూరు



సింహాద్రిపురం మండలం గురజాల సమీపంలో పీబీసీ కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న జమ్ము

జిల్లాలో సాగునీటి పనుల నిర్వహణ, మరమ్మతులకు అవసరమైన నిధులు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. జిల్లా నుంచి జలవనరుల శాఖ సాంకేతిక నిపుణులు పంపిన ప్రతిపాదనలను పరిశీలించి అత్యవసరమైన వాటిని చేపట్టాలని పచ్చజెండా ఊపారు. పులివెందుల బ్రాంచి కాలువ, తెలుగుగంగ, మైలవరం, గండికోట, ఎగువ సగిలేరులో నీటి విడుదలకు ఏర్పాటు చేసిన గేట్లు, తలుపులు సాంకేతిక సమస్యలతో మొరాయిస్తున్నాయి. కాలువల్లో పూడిక, జమ్ము పెరగడంతో నీటి ప్రవాహానికి అడుగడుగునా అడ్డంకులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో 25 పనులకు రూ.4.79 కోట్లు మంజూరు చేశారు. రాష్ట్ర విపత్తు ఉపశమన నిధి (ఎస్‌డీఎంఎఫ్) నిబంధనలను అనుసరించి వీటిని చేపట్టనున్నారు. గండికోట జలాశయానికి రూ.72.25 లక్షలు కేటాయించారు. మైలవరానికి రూ.51.40 లక్షలు ఇచ్చారు. అట్లూరు మండలం కమలకూరు ఆనకట్ట గేట్లను పటిష్ఠం చేయడానికి రూ.10 లక్షలు, బ్రహ్మంసాగర్ ఎడమ కాలువ స్లూయిస్ బాగు చేయడానికి రూ.25 లక్షలకు అనుమతిచ్చారు. వివిధ కాలువల మరమ్మతులకు నిధులిచ్చారు. ఇవేగాక మరికొన్ని పనులను చేపట్టడానికి అవసరమైన పద్దు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. గత వైకాపా పాలనలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు నిధులివ్వాలని ప్రతిపాదనలు పంపినా మోక్షం లభించలేదు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యవసరంగా ఏం చేయాలో సమాచారాన్ని సేకరించి నివేదించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పనులను శరవేగంగా చేయిస్తామని జిల్లా సీఈ ఎం.మల్లికార్జునరెడ్డి తెలిపారు. **- న్యూస్‌టుడే, కడప**

లంకమల... అరుదైన విహంగాల ఖిల్లా

జీవ వైవిధ్యానికి అడ్డా



కిలకిలరావాలతో సందడి చేసే బుల్లిపిట్టలు పర్యావరణ సమతుల్యతను పరిరక్షించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. గాలిలో, నీటిలో తిరిగే హానికరమైన కీటకాలను, శత్రు పురుగులను ఆహారంగా తీసుకోవడం ద్వారా వ్యవసాయానికి తోడ్పాటునిస్తాయి. అలాంటి అపురూప ప్రాణుల్లో కొన్ని అంతరించిపోగా మరి కొన్ని, జిల్లాలోని లంకమల అభయారణ్యంలో సంచరిస్తూ ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్నాయి.

- సిద్దవటం, న్యూస్‌టుడే

జిల్లాలో లంకమల అభయారణ్యానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. సుమారు 46,442.82 హెక్టార్లలో విస్తరించిన ఈ ప్రాంతంలో సుమారు 300కు పైగా పక్షి జాతులు ఉన్నాయని పరిశోధకులు చెబుతున్నారు. వీటిలో చాలా అరుదైన పక్షిగా నీలి నల్లంచి ప్రత్యేకత సంతరించుకుంది. గతంలో సిద్దవటం రేంజిలోని మచ్చాయకుంట ప్రదేశంలో దీనిని అధికారులు గుర్తించారు. కలివికోడి కూడా 1986లో కనిపించి ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చిపెట్టింది. మళ్లీ దీనిని కనిపెట్టాలని అధికారులు ఏళ్ల తరబడిగా పలురకాలుగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. దీనిని పోలిన పక్షులుగా రాతికాలేడు, ఎర్ర చిటవ ఉన్నాయి. మరికొన్ని అరుదైన వాటిలో బంగారు రొమ్ము ఆకు పిట్ట, ఎర్రగొంతు ఈగపట్టు పిట్ట, నీలి ఈగ పట్టు పిట్ట, తోక నల్లంచి, పెద్దఆకురాయి, చారలగొంతు వడ్రంగి పిట్ట, వర్ణ డేగ, అడవి రామదాసు, బుడమాలి గద్ద, జాలి డేగ, నీటి కాకి, తెరపి ముక్కు కొంగ, నల్ల గద్ద, జుట్టు బైరి, తోక పిగిలి పిట్ట, నల్ల తల వంగ పండు, ఎర్ర గువ్వ, కుందేలు సాలవ, పచ్చ గువ్వ, తదితర పక్షులు ఉన్నాయి. ఇక్కడ అరుదైన పక్షి జాతులు ఉండడంతో వాటిని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పలువురు పరిశోధకులు ఇక్కడకు వస్తుంటారు.

పరిరక్షణకు చర్యలు అవసరం

లంకమల అభయారణ్యం అరుదైన పక్షి జాతులకు నిలయంగా ఉంటోంది. ఇవి జీవవైవిధ్యానికి, మానవుని మనుగడకు పరోక్షంగా సహకరిస్తున్నాయి. వాటిలో చాలావరకు అంతరించి పోతుండగా మిగిలిన వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సాధారణ, అరుదైన పక్షి జాతులను కాపాడుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- మహమ్మద్ హయత్, పక్షి పరిశోధకులు, కడప



లంకమల అభయారణ్యం

రైతేరాజు 6లో

డ్రాగన్... దిగుబడి అదిరెన్

లాభాల పంట పండిస్తున్న జమ్మలమడుగు రైతు



ఉమ్మడి కడప జిల్లాలో ఆధునిక ఉద్యాన పంటగా పేరొందిన డ్రాగన్ ఫ్రూట్ సాగు సిరులు తెచ్చి పెడుతోంది. జమ్మలమడుగుకు చెందిన రైతు వరప్రసాద్ ఈ పంటను సాగు చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పెన్నా నదికి సమీపంలో నాలుగేళ్ల కిందట సుమారు అయిదు ఎకరాల్లో 2 వేల తైవాన్ పింక్ మొక్కలు, 2 వేల అమెరికన్ పింక్ మొక్కలు తెప్పించి నాటారు. రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడుతున్నారు. ప్రస్తుతం పింక్ రకానికి చెందిన డ్రాగన్ ధర కిలో రూ.100 నుంచి రూ.130 పలుకుతోంది ముంబయి, హైదరాబాద్, విజయవాడ, ఒంగోలు వంటి ప్రాంతాలకు డ్రాగన్ ఫ్రూట్ ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం తైవాన్ పింక్‌కు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఎకరానికి రూ.అయిదు లక్షలు పెట్టుబడి పెట్టగా ఖర్చులన్నీ పోనూ రూ.లక్ష ఆదాయం వచ్చిందని.. అయిదు ఎకరాలకు గాను రూ.ఐదు లక్షల మేర లాభం ఆర్జించినట్లు చెబుతున్నారు. ఉద్యాన శాఖ తరపున హెక్టారుకు రూ.50 వేలు రాయితీ ఇస్తున్నామని ప్రొద్దుటూరు డివిజన్ ఉద్యానశాఖ అధికారి భరత్‌రెడ్డి తెలిపారు. **- న్యూస్‌టుడే, జమ్మలమడుగు**



వర ప్రసాద్, డ్రాగన్ తోట రైతు, జమ్మలమడుగు

రైతేరాజు

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

ప్రశ్న: రబీలో ఉలవ సాగు చేయాలంటే ఎకరాకు ఎన్ని కిలోల విత్తనం కావాలి. ఏ రకం ఎరువులు వేయాలో తెలియజేయండి?
- సి.వెంకట్రామయ్య, రైతు, చింతకొమ్మదిన్నె

సమాధానం: గొర్రుతో వరుసల్లో విత్తే పద్ధతిలో ఎకరాకు 8-10 కిలోలు, వెదజల్లే విధానంలో 12-15 కిలోలు విత్తనం సరిపోతుంది. వరుసల మధ్య 30 సెం.మీ, మొక్కల నడుమ 10 సెం.మీ దూరం పాటించాలి. అలాగే ఎకరాకు నాలుగు కిలోల నత్రజని, 10 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్‌ను ఇచ్చే పోషకాలను ఆఖరి దుక్కిలో భూమిలో విత్తే ముందు వేసుకోవాలి.
- డాక్టర్ ఎ.వీరయ్య, సమన్వయకర్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు, - కడప, న్యూస్‌టుడే

బెండలో ఎరువుల యాజమాన్యం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: బెండ సాగు చేసే రైతులు భూసార పరీక్షల ఫలితాలను అనుసరించి ఎరువులను వేసుకోవాలి. చివరి దుక్కిలో ఎకరాకు పశువుల ఎరువు 6-8 టన్నులు, వేపపిండి 100 కిలోలు చొప్పున వేయాలి. జీవన ఎరువులైన అజటోబాక్టర్ 1 కిలో, పి.ఎస్.బి ఒక కిలో, ట్రైకోడెర్మా 2-2.5 కిలోలు సేంద్రియ సత్తువలతో కలిపి వృద్ధి చేసి పొలంలో చల్లుకోవాలి. సూక్ష్మ పోషకాల నివారణకు ఎకరాకు ఫెర్రస్ సల్ఫేట్, జింక్ సల్ఫేట్ 8 కిలోలు, బోరాక్స్ 2 కిలోలు నాటే సమయంలో వేసుకుంటే మంచిది. భాస్వరం, పొటాష్‌ను ఇచ్చే ఎరువులు 24 కిలోలను ఆఖరి దుక్కిలో వేయాలి. నత్రజని ఇచ్చే ఎరువును 48 కిలోలను మూడు సమ భాగాలు చేసి నాలుగో వంతు చివరి దుక్కిలో చల్లాలి. మిగిలిన సత్తువను రెండు సమ భాగాలుగా చేసుకుని విత్తిన 30, 45వ రోజు చల్లాలి. సిఫారసు చేసిన రసాయన ఎరువులను విత్తిన వారం రోజుల తర్వాత, ద్రవ రూపంలోని జీవన ఎరువులను బిందు సేద్యం విధానం ద్వారా మొక్కలకు అందించవచ్చు. సంకర జాతి రకాలను మోతాదును 50 శాతం అదనంగా వేయాలి. నాటిన 30, 45, 90 రోజులకు 19:19:19 పోషకం 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. సూక్ష్మ పోషక మిశ్రమం 5 గ్రాములు లీటరు నీటికి కలిపి 30, 45వ రోజులకు పిచికారీ చేసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చు. పూత దశలో యూరియా 10 గ్రాములు లీటరు నీటికి కలిపి చల్లితే 25 శాతం నత్రజనిని ఆదా చేయవచ్చు. **- మానస, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు**

చిట్కా...

ఉలవ సాగులో... విత్తనం ఎంపికే కీలకం

రాజంపేట పట్టణం, న్యూస్‌టుడే: ఉలవలో పోషకాలు మెండు... ఔషధ గుణాలు అధికంగా ఉంటాయి. విపణిలో ఏడాది పొడవునా గిరాకీ ఉంటుంది. రైతులు కూడా సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్‌లో ఆలస్యంగా, రబీలో ముందస్తుగా మెట్ట భూముల్లో సాగు చేయాలని కర్షకులు సన్నద్ధమవుతున్నారు. మేలిమి విత్తనంతో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలైన దిగుబడి పొందవచ్చునని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ కె.సాయి మహేశ్వరి, డాక్టర్ ఎ.వీరయ్య, డాక్టర్ వి.శిల్పకళ, డాక్టర్ టి.మహేష్‌బాబు సూచించారు.

నేలలు : చల్కా, ఎర్ర, నల్లరేగడి అనుకూలం.

విత్తన రకాలు : పీడీఎం-1: పంట కాలం 105 రోజులు. ఎకరాకు 6-6.5 క్వింటాళ్లు దిగుబడి వస్తుంది. గింజలు బూడిద రంగులో ఉంటాయి.

క్రీడ-18-ఆర్ : పంట కాలం 85-90 రోజులు. ఎకరాకు 5-6.5 క్వింటాళ్ల దిగుబడి రానుంది. గింజలు గోధుమ రంగులో ఉంటాయి. పల్లాకు, బూడిద తెగుళ్లను తట్టుకోగలదు.

క్రీడ హర్ష (సి.ఆర్.హెచ్.జి-19) : పంట 85-95 రోజుల్లో ముగుస్తుంది. ఎకరాకు 6-7.7 క్వింటాళ్ల దిగుబడి పొందే అవకాశం ఉంది. గింజలు గోధుమ వర్ణంలో ఉంటాయి. బూడిద, ఆంత్రాక్నోస్ చీడలను తట్టుకొంటుంది.



ఉలవ విత్తనాలు

అనంత ఉలవ (ఏటీపీహెచ్‌జి-11) : పంట కాలం 110-120 రోజులు. ఎకరాకు 6-6.5 క్వింటాళ్ల దిగుబడి పొందవచ్చు. గింజలు బూడిద, గోధుమ రంగులో ఉంటాయి.

విత్తే సమయం : సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో సాగుకు అనుకూలం.

విత్తన మోతాదు: గొర్రు విధానంలో విత్తనం వేయాలంటే ఎకరాకు 8-10 కిలోలు, వెదజల్లే పద్ధతిలో 12-15 కిలోల విత్తనం సరిపోతుంది.

విత్తే దూరం : వరుసల మధ్య 30 సెం.మీ, మొక్కల నడుమ 10 సెం.మీ ఎడం ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.

విత్తనశుద్ధి : కిలో విత్తనానికి కార్బండిజమ్ గ్రాము కలిపి విత్తనశుద్ధి చేయాలి.

ఎరువులు : ఎకరాకు నత్రజని నాలుగు కిలోలు, భాస్వరం 10 కిలోలు, పొటాష్ 8 కిలోలు చొప్పున విత్తనం వేసే ముందు వేసుకోవాలి.

కలుపు నివారణ : విత్తిన 25-30 రోజుల మధ్యలో నేలలో తగినంత తేమ చూసుకుని గొర్రుతో అంతరకృషి చేయాలి. కూలీలతో ద్వారా కలుపు మొక్కలను తీసేయాలి.

కాయ తొలిచే పురుగు : పూత, పిందె ఏర్పడే దశలో పంటను ఆశించి నష్టాన్ని కలుగజేస్తుంది.

నివారణ: క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లీటరు నీటికి కలిపి అవసరాన్ని బట్టి మందులను మార్చు చేసి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు: వాతావరణంలో అధిక తేమ ఉండి, రాత్రి పగటి ఉష్ణోగ్రతల్లో ఎక్కువ వ్యత్యాసం ఉన్నప్పుడు ఈ తెగులు బాగా వ్యాప్తి చెందుతుంది.

నివారణ: కార్బండిజమ్ గ్రాము లీటరు నీటిలో కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. నిర్దేశించిన కాలంలో విత్తుకోవాలి.

వేరుకుళ్లు: తొలుత వేర్లు కుళ్లిపోతాయి. ఆ తర్వాత ఆకులు జీవం కోల్పోయి ఎండిపోతాయి.

నివారణ: పొలంలో తెగులు సోకిన మొక్కల చుట్టూ ఉన్న నేలను కార్బండిజమ్ గ్రాము లేదా మాంకోజెబ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపిన ద్రావణంతో బాగా తడిచేలా పిచికారీ చేయాలి.

ఇంజినీరు అవ్వాలని ఉంది

- విధి వక్రించి విద్యుదాఘాతం
- రెండు చేతులు, కాలు కోల్పోయిన విద్యార్థి
- దాతల సాయానికి నిరీక్షణ

పీలేరు, న్యూస్‌టుడే: మరో నాలుగు నెలల్లో ఇంజినీరింగ్ చదువు పూర్తవుతుంది. ఇక ఉద్యోగ వేటలో విజయం సాధించి తల్లిదండ్రులకు ఆదరువుగా నిలవచ్చని ఆశించిన ఆ విద్యార్థి విద్యుదాఘాతం రూపంలో విధి కాటేస్తుందని ఊహించలేకపోయాడు. ఇంటికి ఆసరాగా నిలవాల్సిన యువకుడు రెండు చేతులు, ఒక కాలు కోల్పోయి మంచానికే పరిమితమయ్యాడు. చెట్టంత కొడుకు కళ్లముందే ఇలా కూలిపోవడంతో ఆ కుటుంబం పరిస్థితి తారుమారైంది. పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ తూగుంటపల్లెకు చెందిన దేవేంద్ర ఉదంతమిది.

★ మండలంలోని బాలంవారిపల్లె పంచాయతీ తూగుంటపల్లెకు చెందిన కృష్ణయ్య, భారతి కుమారుడు దేవేంద్ర (22) పీలేరులో పదో తరగతిలో 9.3 పాయింట్లు, ఇంటర్మీడియట్ ఎంపీసీలో 964 మార్కులు సాధించి కడపలో బీటెక్ సీఎస్‌సీ చదువుతున్నాడు. ఇప్పటికి 90 శాతం మార్కులు సాధించారు. ఇక చివరి సెమిస్టర్ పరీక్షలు రాయాల్సి ఉంది. ఈ పరిస్థితిలో ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీన దేవేంద్ర పల్లెలోని వ్యవసాయ బోరుకు వద్దకు వెళ్లి పొలానికి నీరు పారించేందుకు మోటరు స్టార్టరు వద్ద విద్యుత్తు తీగను సరిచేసే సమయంలో విద్యుదాఘాతానికి గురై పక్కకు పడిపోయారు. ఈక్రమంలో శరీరం అంతా గాయాలతో కమిలి పోవడంతో చికిత్స కోసం కుటుంబ సభ్యులు పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. ఇక్కడ ప్రథమ చికిత్స తరువాత తిరుపతికి వెళ్లాలని వైద్యులు సలహా ఇవ్వడంతో తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ చేతులకు, కాళ్లకు చికిత్స చేసిన తరువాత చెన్నై కేఎంసీ (కురుపాళెం మెడికల్ కాలేజీ) వైద్యశాలలో ఉండి రెండు చేతులు, ఎడమ కాలు కాలిపోయినంత వరకు తొలగించి గాయాలు మానేందుకు చికిత్స చేసి ఇంటికి పంపారు. అవయవాలు కోల్పోవడంతో కృత్రిమ అవయవాలు వేసుకునేందుకు జైపూర్ నుంచి అవయవాలు తెప్పించేందుకు రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. దీంతో అంత ఖర్చు భరించే స్తోమత లేక దేవేంద్ర తల్లిదండ్రులు కృష్ణయ్య, భారతి ఆందోళన చెందుతున్నారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు చదువు పూర్తి అయితే కుటుంబానికి ఆదరువుగా ఉంటాడనుకుంటే విద్యుదాఘాతంతో పరిస్థితి తిరగబడిందని రోదిస్తున్నారు. వైద్యం కోసం తిరుపతి, చెన్నైలు తిరగడం వల్ల రూ.10 లక్షల వరకు ఖర్చు అయిందని. దీనికి ఉన్న కొద్దిపాటి పొలం కూడా అమ్మేశారు. ఇక కట్టుబట్టలు తప్ప ఏ ఆదరవు లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యుత్తుశాఖ సిబ్బంది వచ్చి విచారించి దేవేంద్ర స్వయంగా తీగలు సరిచేస్తుండగా ప్రమాదం జరిగిందని రాసుకుని వెళ్లినా వారి నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందలేదు. ఈనెల 28వ తేదీ నుంచి బీటెక్ పరీక్షలు రాయాల్సి ఉంది. ఈ పరిస్థితిలో రెండు చేతులు పోవడంతో పరీక్షలు ఎలా రాయాలని విద్యార్థి కంటతడి పెడుతున్నాడు. ప్రభుత్వపరంగా కృత్రిమ అవయవాలు ఇప్పించడంతో పాటు వ్యక్తిగత సహాయకుడిని ఏర్పాటు చేసి చివరి సెమిస్టర్ పరీక్షలు రాసేలా తగిన సాయం చేయాలని దేవేంద్రతో పాటు తల్లిదండ్రులు కోరుతున్నారు.




తెల్లావుల దేవేంద్ర

దాతలు స్పందించి ఫోన్ చేయాల్సిన చరవాణి నంబరు : 9154991003

వరద బాధితులకు రూ.19 లక్షల విరాళం

అంగళ్లు (కురబలకోట), న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితుల సహాయార్థం మిట్స్ కళాశాల యాజమాన్యం తరపున రాష్ట్ర ప్రభుత్వానికి రూ.19 లక్షల విరాళాన్ని అందజేసినట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ నాదెళ్ల విజయభాస్కర్ చౌదరి సోమవారం తెలిపారు. తాడేపల్లెలోని క్యాంపు కార్యాలయంలో ఇటీవల మంత్రి లోకేశ్‌ను కలిసి విరాళం అందజేసినట్లు వివరించారు.



మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న మిట్స్ కళాశాల కరస్పాండెంట్ నాదెళ్ల విజయభాస్కర్

వృద్ధాశ్రమం ప్రారంభం

రాయచోటి, న్యూస్‌టుడే: వృద్ధులకు సేవలు చేయడం మానవతావాదులకు వరం లాంటిదని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తిరుపతినాయుడుకాలనీలో ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. రాయచోటిలో వృద్ధాశ్రమం నిర్వాహించడం అభినందనీయమన్నారు. వృద్ధులను అన్ని విధాలా ఆదుకుని వారికి చివరి అంకంలో చేయూతనివ్వాలని నిర్వాహకులకు సూచించారు. దానాల్లో అన్నింటికంటే అన్నదానం గొప్పదన్నారు. దాతృత్వం, దాన గుణం, మానవత్వం కలిగిన వారు ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పి.మదన్‌మోహన్‌రెడ్డి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

అర్జీదారుల సమస్యలు చట్ట పరిధిలో పరిష్కరించాలి

రాయచోటి, న్యూస్‌టుడే: అర్జీదారుల సమస్యలు పోలీసు అధికారులు చట్టపరిధిలో సత్వరం పరిష్కరించాలని ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సమస్యలు పరిష్కారం కాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 44 మంది అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు.



అర్జీదారు సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీలో ఉచిత శిక్షణ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులు డీఎస్సీలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు పొందేలా ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు సరస్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెట్ అర్హత కలిగి, వార్షికాదాయం రూ.2.50 లక్షల్లోపు ఉన్న వారు ఈ నెల 21వ తేదీ లోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులకు ఈనెల 27న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని ఉపసంచాలకులు చెప్పారు.

వైద్యవృత్తిలో సేవాభావం అవసరం

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: వైద్య సేవకు అంకితం కావాలంటే అకుంఠిత దీక్ష, పట్టుదల, సేవాభావం కలిగి ఉండాలని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ అన్నారు. స్థానిక వైద్య కళాశాలలో సోమవారం మొదటి సంవత్సరం వైద్య విద్య విద్యార్థులకు ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి ఆహ్వానం పలికారు. వారు మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ప్రతి రోజూ అధ్యాపకుల సూచనలతో విద్యను అభ్యసించాలని, మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరికీ వ్యాయామం, ధ్యానం తప్పనిసరిగా అలర్చుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, వసతిగృహం వార్డెన్ డాక్టర్ సునీల్, డాక్టర్ లక్ష్మీనరసమ్మ, విభాగాధిపతులు పాల్గొన్నారు.



వైద్య విద్యార్థుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ

దారి సమస్య పరిష్కారానికి వినతి

మదనపల్లె గ్రామీణ, బి.కొత్తకోట, న్యూస్‌టుడే : దారి సమస్య పరిష్కరించాలని బి.కొత్తకోటకు చెందిన స్థానికులు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట బి.కొత్తకోట పట్టణంలోని శెట్టిపల్లెరోడ్డులోని వయాలవంకవీధికి చెందిన ప్రజలు నిరసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ వీధిలో కొందరు దారి లేకుండా కంచె వేశారని ఆరోపించారు. కొన్నేళ్లుగా ఈ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు కంచె వేశారని, కొందరు ఇళ్ల నుంచి బయటకు కూడా వెళ్లేందుకు దారి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాఠశాలకు వెళ్లేందుకు పిల్లలతో పాటు, ఇక్కడ నివాసముంటున్న వారికి దారి లేదన్నారు. గతంలోనూ ఇదే సమస్య తలెత్తితే రెవెన్యూ అధికారులు చర్చించి పరిష్కరించారని, దీనిపై విచారించి న్యాయం చేయాలని డీఏవోకు అర్జీ సమర్పించారు. స్థానికులు నాగరాజు, ఉత్తన్న, సిరాజ్, షతాజ్, హసీన తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న బి.కొత్తకోట వాసులు

వసతిగృహాల పరిశీలన

కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే: కడప నగరంలోని ప్రకాష్ నగర్, బాలాజీనగర్, కో ఆపరేటివ్ కాలనీల్లోని బీసీ వసతిగృహాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ సోమవారం పరిశీలించారు. వసతి గదులను, వంటశాలను, డైనింగ్ హాలు, స్టోర్ రూములను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : అతిగా మద్యం తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మదనపల్లె పట్టణంలో సోమవారం జరిగింది. కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు మండలం బల్తమూరుకు చెందిన భాస్కర్ రెడ్డి (36) మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం మదనపల్లెకు వచ్చి ఇక్కడే తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం బెంగళూరు రోడ్డులో మద్యం తాగి కిందపడి ఉండగా స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి చిరునామా ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.

రాయచోటిలో విద్యార్థిని ఆత్మహత్య

రాయచోటి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని (14) ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఫోన్‌లో ఇతరులతో మాట్లాడుతున్న విషయం కుటుంబ సభ్యులు తెలిసిందనే భయంతో ఆందోళన చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని ఎస్సై నరసింహారెడ్డి తెలిపారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నవంబరు 9, 10 తేదీల్లో కడపలో జాతీయస్థాయి ఉర్దూ సదస్సు

కడప విద్య, న్యూస్‌టుడే : కడపలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నవంబరు 9, 10 తేదీల్లో అంజుమన్‌తరఖ్ఖి ఉర్దూ (ఉర్దూ భాషాభివృద్ధి సంఘం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఉర్దూ సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు సత్తార్‌ఫైజీ, సయ్యద్ హిదాయతుల్లా ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ అంశాలపై ఉర్దూ సాహితీవేత్తలు, పరిశోధకులు పరిశోధన పత్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఉర్దూ పుస్తకాల ఆవిష్కరణ, కవి సమ్మేళనం, ఉర్దూ ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల, యూనివర్సిటీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, వివిధ జిల్లాల శాఖల ప్రతినిధులు, ఉర్దూ కవులు, రచయితలు, విమర్శకులు, ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొంటారని వెల్లడించారు.

రైతుబజారులో రాయితీ నూనెల విక్రయం

కడప గ్రామీణ: కడప రైతుబజారులో రాయితీపై వంట నూనె విక్రయాలను సోమవారం ప్రారంభించారు. రాయితీపై 850 గ్రాముల పామోలిన్ ప్యాకెట్ రూ.110, సన్‌ఫ్లవర్ 910 గ్రాముల ప్యాకెట్ రూ.125కు అమ్మేలా చర్యలు చేపట్టింది. ఏఎస్ఓ తారక్‌నాథ్‌రెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దక్షిణామూర్తి, ఎంఎల్ఆర్ఐ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టుకు డిమాండు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: హత్య కేసులో నిందితులను తక్షణం అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. దీనిపై సోమవారం ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు వినతిపత్రం అందజేశారు. గాలి చంద్ర మాట్లాడుతూ పెండ్లిమర్రి మండలం యాదవాపురానికి చెందిన ఆదిమూలం శ్రీనివాసులును ఈ ఏడాది ఏప్రిల్ 2న అతని పొలంలోనే హత్య చేశారని తెలిపారు. ఈ కేసులో నిందితులైన చిన్నపుల్లారెడ్డి, నాగపుల్లారెడ్డిలను ఇప్పటి వరకు అరెస్టు చేయలేదని, వీరు మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరులమని చెబుతూ భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కేసుకు సంబంధించి సిట్ వేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని, వెంటనే వారిద్దరినీ అరెస్టు చేయాలని డిమాండు చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాదుల్లా, గంగాసురేష్ ఉన్నారు.

పట్టాభిరాముడి పవిత్రోత్సవాలకు అంకురార్పణ

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : తితిదే ఆధ్వర్యంలోని స్థానిక పట్టాభిరామాలయంలో సోమవారం రాత్రి వేదపండితుల మంత్రాల మధ్య నిర్వహించిన అంకురార్పణతో స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అంతకుముందు ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు మూలవరులకు అభిషేకం, 7 గంటలకు అలంకరణ, తోమాలసేవ, పంచాంగశ్రవణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో రాత్రి 7 గంటలకు స్వస్తి పుణ్యాహవచనం, మృత్సం గ్రహణం, రక్షాబంధనం, సేనాధిపతి ఉత్సవం, కలశస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తితిదే వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య ఉత్సవాల ప్రారంభానికి సూచికంగా అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు కృష్ణరాజ్‌భట్టార్, బాషికాచార్యులు, తితిదే అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



అంకురార్పణ నిర్వహిస్తున్న వేద పండితులు

దసరా పేరిట ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ

- ప్రయాణికుల నుంచి రెట్టింపు ఛార్జీల వసూలు
- పట్టించుకోని రవాణా శాఖ అధికారులు

రాయచోటి, న్యూస్‌టుడే: పండగల సీజన్ వచ్చిందంటే ఊళ్లకు వచ్చేందుకు ప్రయాణికుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ప్రధాన మార్గాలలో ఆర్టీసీ బస్సుల సర్వీసులు తక్కువగా ఉండడంతో ప్రైవేట్ ట్రావెల్స్ ఎక్కువగా నడుస్తున్నాయి. జిల్లాలోని ప్రధాన పట్టణాలైన రాయచోటి, మదనపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల నుంచి హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు సాఫ్ట్‌వేర్, ఇతర రంగాలలో పని చేసే వారితో పాటు ఉన్నత విద్యను అభ్యసించే వారు దసరాలకు సొంతూర్లకు వచ్చారు. పండగ అనంతరం తిరిగి వెళ్లాలంటే రాయచోటి నుంచి 490 కిలో మీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్‌కు ఒక్కో టిక్కెట్ రూ.2,200 పైబడి ధర పెట్టి ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్నారు. విజయవాడకు వెళ్లే ప్రయాణికుల పరిస్థితి కూడా ఇంతే.

మంత్రి జిల్లాలో ప్రయాణికులపై భారం

జిల్లా నుంచి రవాణా శాఖ మంత్రిగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఆయన మాతృశాఖను ప్రక్షాళన చేస్తున్నామని చెబుతున్నారే తప్ప ప్రయాణికుల కష్టాలపై దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. రాయచోటి-హైదరాబాద్, రాయచోటి-విజయవాడ, రాయచోటి-బెంగళూరు, రాయచోటి-చెన్నై ప్రాంతాలకు విద్యార్థులతో పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వేల సంఖ్యలో ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మినిమం ఛార్జీలు వసూలు చేస్తుండగా ప్రైవేట్‌లో వారికి ఇష్టం వచ్చిన రీతిలో ఛార్జీలు వసూలు చేస్తున్నా రవాణా శాఖ అధికారులు ఎక్కడా తనిఖీలు నిర్వహించి అనధికారిక వసూళ్లను కట్టడి చేసిన దాఖలాలు కనిపించలేదు. రాయచోటి నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులో రూ.720 ఛార్జీలు ఉండగా ప్రైవేట్ నాన్ ఏసీ స్లీపర్ బస్సులో రూ.2,200 వసూలు చేస్తున్నారు. విజయవాడకు రద్దీని బట్టి ఛార్జీలు అప్పటికప్పుడే పెంచేస్తున్నారు. రాయచోటి నుంచి వెళ్లాలంటే ఏసీ బస్సుల్లో ఛార్జీ రూ.2,300 వసూలు చేస్తున్నారు.

180 కిలో మీటర్లు.. రూ.1,900 టిక్కెట్

జిల్లాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వారాంతంలో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాల నుంచి సొంతూళ్లకు వస్తుంటారు. శుక్రవారం, ఆదివారం రోజులలో రాకపోకలు ఎక్కువగా సాగిస్తున్నారు. రాయచోటి నుంచి బెంగళూరు వెళ్లాలంటే ఆర్టీసీలో రూ.380 ఛార్జీ ఉండగా ప్రైవేట్ బస్సులలో రూ.1,400 నుంచి రూ.2,000 వసూలు చేస్తున్నారు. కడప-బెంగళూరు హైవే మార్గంలో ఆర్టీసీ బస్సులు తక్కువగా ఉండడంతో ప్రైవేట్ బస్సుల నిర్వాహకులు ఈ మార్గాన్ని ఆదాయవనరుగా మార్చుకున్నారు. ఆత్మకూరు, కనిగిరి, కావలి, వింజమూరు, ప్రొద్దుటూరు, కడప, పోదలకూరు ప్రాంతాల నుంచి రాయచోటి మీదుగా బెంగళూరుకు సూపర్ లగ్జరీ బస్సులు వెళ్తుంటాయి. రాత్రి 7 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు వందలాది బస్సులు ఈ మార్గంలో నడుస్తున్నాయి. కడప, రాయచోటి, మదనపల్లెలలో వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. చెన్నై మార్గంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రైవేట్ వాహన నిర్వాహకులు రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల నుంచి వసూలు చేస్తున్న అధిక ఛార్జీల కట్టడికి రవాణా శాఖ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రాయచోటిలో బస్సెక్కుతున్న ప్రయాణికులు

ప్రధాన మార్గాల్లో ఆర్టీసీ సర్వీసులు

ప్రయాణికుల అవసరాల మేరకు ప్రధాన మార్గాలలో ఆర్టీసీ బస్సులు నడుపుతున్నాం. పండగ సీజన్లలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినప్పటికీ ఛార్జీలు పెంచడం లేదు. ప్రైవేట్ బస్సులను ఆశ్రయించడం కంటే ఆర్టీసీలోనే ప్రయాణం సురక్షితంగా ఉంటుంది. ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నాం. త్వరలోనే జిల్లాకు మరికొన్ని కొత్త ఆర్టీసీ బస్సులు రానున్నాయి. ప్రధాన మార్గాలలో నడిపి ప్రయాణికులకు ఆర్థిక భారం లేకుండా చూస్తాం. **- రాము, జిల్లా ప్రజా రవాణా అధికారి, అన్నమయ్య**

పంటకోత పనులు వాయిదా వేసుకోవాలి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : తుపాను ప్రభావం నేపథ్యంలో రైతులు నాలుగు రోజుల పాటు పంటకోత పనులు వాయిదా వేసుకోవాలని మదనపల్లె వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు శివశంకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు వేరుసెనగ పంటను తొలగించి ఉంటే దానిపై టార్పాలిన్ కప్పి ఉంచాలని తెలిపారు. మడి కయ్యల్లో నిలిచిన నీటిని చిన్న కాలువలు చేసి బయటకు పంపాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది, మండల వ్యవసాయాధికారులు కార్యాలయాల్లో అందుబాటులో ఉంటూ రైతులకు ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే స్పందించాలని సూచించారు.

కల్వర్టును పునరుద్ధరించాలని వినతి

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : పట్టణ శివారు ప్రాంతంలోని ఇరానీ కాలనీ వద్ద మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారిపై ఉన్న కల్వర్టును ఇటీవల కొందరు పూడ్చేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వర్షాలు కురిస్తే వాననీరు కల్వర్టు కింద వెళ్లేదని, ప్రస్తుతం కల్వర్టును పూడ్చడంతో నీరంతా జాతీయ రహదారిపైనే నిల్వ ఉంటుందని, దీంతో ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు చొరవ తీసుకుని కల్వర్టును పునరుద్ధరించాలని కోరుతున్నారు.



మట్టితో పూడ్చిన కల్వర్టు

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

మౌలిక వసతుల కల్పనకు కృషి


మహిళా కార్యకర్తలతో మాట్లాడుతున్న నల్లారి తనూజరెడ్డి

పీలేరు గ్రామీణ : గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సతీమణి నల్లారి తనూజరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పీలేరులో తెదేపా మహిళా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్లు, వీధి దీపాల సమస్యను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. విడతల వారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రమాదేవి, సుబ్రమ్మ, సబిహా, కాంతమ్మ, పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారని ఫిర్యాదు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : ఉన్నతాధికారులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్యదర్శిని సొంత పంచాయతీకి బదిలీ చేశారని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ ఆరోపించారు. సోమవారం రాయచోటి జిల్లా కేంద్రంలో డీపీవో ధనలక్ష్మికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ చట్టాన్ని, పరిపాలన నియమాలకు విరుద్ధంగా అంకిశెట్టిపల్లె పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేశారని పేర్కొన్నారు. జీవో ప్రకారం ఏ అధికారి సొంత మండలంలో పని చేయకూడదనే నిబంధన ఉందన్నారు. ఇటీవల జరిగిన కార్యదర్శుల బదిలీల్లో మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీలో నివాసముంటున్న మంజులను నియమించినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేసిన కార్యదర్శిపై విచారణ చేపట్టి మరో ప్రాంతానికి బదిలీ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘం నాయకులు చిరంజీవి, నవీన్, జగదీష్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.


డీపీవో ధనలక్ష్మికి ఫిర్యాదు చేస్తున్న బహుజన యువసేన నాయకులు

పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

స్పందనకు వందనం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో మస్తాన్‌వల్లి హెచ్చరించారు. కొత్తిండ్లు పంచాయతీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో 'ఈనాడు'లో ఈ నెల 13న 'మేమున్నాం..మీకుతోడుగా'లో సమస్య ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీవో సోమవారం కొత్తిండ్లు, భవానీనగర్‌లో క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై తనిఖీ చేశారు. ప్రతి రోజు ఇంటింటా చెత్త సేకరించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, వాననీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నీరుగారిన లక్ష్యం
ఉపాధి దూరం

మదనపల్లె పట్టణం, గ్రామీణ, న్యూస్‌టుడే : రైతులను ప్రోత్సహించడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకునేందుకు అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో విస్తారంగా సాగు చేస్తున్న మల్బరీ పంటను దృష్టిలో ఉంచుకుని దానికి అనుబంధంగా పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి రీలర్స్ శిక్షణ కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొన్నేళ్ల పాటు ఇక్కడ రీలర్లకు శిక్షణ ఇచ్చినా తర్వాత మూతపడింది.

● ఒకప్పుడు మదనపల్లెతో పాటు పరిసర ప్రాంతాల్లో వాణిజ్య పంటలైన వేరుసెనగను విస్తారంగా సాగు చేసేవారు. రెండో వాణిజ్య పంటగా మల్బరీసాగు చేసేవారు. ఒక్క మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో మాత్రమే 50 వేల ఎకరాల పైబడి రైతులు మల్బరీసాగు చేసేవారు. ఇలా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 61 మండలాల్లో లక్ష ఎకరాలకు పైగా సాగు చేసేవారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో 1991లో రీలర్ల శిక్షణ కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపిక చేసిన రైతులతో నాణ్యమైన పట్టుగూళ్లను పెంచడంతో పాటు పట్టుగూళ్లను రీలింగ్ చేయడంతో శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు.


పుంగనూరు రోడ్డులో రీలర్స్ శిక్షణ కేంద్రం

నిరవధికంగా మూతపడిన రీలర్ల శిక్షణ కేంద్రం

నాణ్యమైన పట్టుగూళ్ల ఉత్పత్తి లక్ష్యం

మదనపల్లె పట్టుపరిశ్రమశాఖ పరిధిలోని కొంతమంది రైతులను ఎంపిక చేస్తారు. ఏడాదికి 35 నుంచి 40 మంది రైతులను ఎంపిక చేసి వారికి ప్రభుత్వం గ్రైనేజిల నుంచి నాణ్యమైన స్వదేశీ, విదేశీ పట్టు గుడ్లు అందజేస్తారు. గుడ్లు తీసుకున్న రైతులు ఆ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి పట్టుగూళ్ల పెంపకం చేస్తారు. ఇలా పెంచిన గూళ్లను రీలింగ్ కేంద్రానికి తీసుకొస్తారు. ఇక్కడ పరీక్షకేంద్రంలో గూళ్ల నాణ్యతను పరీక్షిస్తారు. పరీక్షల్లో నాణ్యత బాగుంటే వాటిని మళ్లీ గ్రైనేజి కేంద్రాలకు విక్రయించి నాణ్యమైన పట్టు గుడ్లను ఉత్పత్తి చేయిస్తారు. వీటిని చాకీ కట్టి మళ్లీ రైతులకు విక్రయిస్తారు. అయితే ఈ ప్రక్రియ ఇప్పుడు జరగడం లేదు. దేశీయ పట్టుగూళ్ల పరీక్ష కేంద్రం ఏడీ పోస్టు ఖాళీగా ఉంది. ఎఫ్.ఆర్. పట్టుగూళ్ల పరీక్షకేంద్ర ఏడీ ఉన్నా పట్టుగూళ్ల పరీక్షలు జరగడం లేదు. ప్రస్తుతం మదనపల్లె పట్టు పరిశ్రమశాఖ పరిధిలో పది మంది రైతులు కూడా నాణ్యమైన పట్టుగూళ్లు ఉత్పత్తి చేయడం లేదు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తే నిర్వహణ లోపంతో వారు నష్టపోతున్నారు.

గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి కల్పన

ఇక్కడ పట్టుగూళ్ల పరీక్షలతో పాటు రీలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు పట్టుగూళ్ల రీలింగ్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం ముఖ్య ఉద్దేశ్యం. ఇందులో శిక్షణ పూర్తి చేసుకున్న వారు బయటకు వెళ్లి రీలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలు పొందవచ్చు. రీలింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం రుణ సౌకర్యం కూడా కల్పిస్తుంది. ప్రస్తుతం ఇక్కడ ఏర్పాటు చేసిన రీలింగ్‌కేంద్రం నిరవధికంగా మూతపడింది. సంవత్సరానికి మూడు బ్యాచ్‌లకు అంటే సుమారు 450 మందికి గతంలో శిక్షణ ఇచ్చేవారు. ఇది మూతపడటంతో గ్రామీణ నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు కోల్పోయారు.

సాగు విస్తీర్ణం తగ్గిపోవడంతోనే సమస్య

ఈ ప్రాంతంతో వర్షాభావ పరిస్థితుల కారణంగా మల్బరీసాగు విస్తీర్ణం తగ్గిపోయింది. రైతులు 80 శాతంపైగా టమాటా పంటసాగుపై ఆసక్తి చూపడంతో సాగు తగ్గి దాని అనుబంధం పరిశ్రమల మనుగడ కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అన్నమయ్య జిల్లాలో 10 వేల ఎకరాల్లో కూడా మల్బరీసాగు లేదు. ఇలాంటి పరిస్థితిలో పట్టుగూళ్ల ఉత్పత్తి పెరగడం అసాధ్యం. అధికారులు రైతులను చైతన్యపరిచి సాగు విస్తీర్ణం పెంచడానికి కృషి చేయాల్సి ఉంది. అలా చేసినప్పుడే ఈ ప్రాంతంలోని పట్టుపరిశ్రమ అనుబంధ రంగాలు కళకళలాడతాయి. ఎంపిక చేసిన రైతులకు నాణ్యమైన పట్టుగుడ్లను ఇచ్చి గూళ్లను ఉత్పత్తి చేయిస్తున్నామని ఎఫ్.ఆర్. విభాగం ఏడీ రాధ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. సంవత్సరానికి 35 నుంచి 40 మంది రైతుల వద్ద నాణ్యమైన పట్టుగూళ్లను పెంచాల్సి ఉందన్నారు. పరీక్షకేంద్రంలో పట్టుగూళ్లను పరీక్షించి గ్రైనేజి కేంద్రాలకు విక్రయించడం జరుగుతుందని ఏడీ తెలిపారు

పల్లెలకు పూర్వ వైభవం తీసుకొస్తాం

జర్రావారిపల్లె (వాల్మీకిపురం), న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పల్లెలకు పూర్వవైభవం తీసుకొస్తామని తెదేపా మండలాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని జర్రావారిపల్లె పంచాయతీలో తెదేపా రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి వల్లిగట్ల వెంకట్రమణతో కలిసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మండలంలోని అయ్యవారిపల్లె, నగిరిమడుగు, ముస్టూరువాండ్లపల్లె, గండబోయనపల్లె తదితర గ్రామాల్లో పల్లెపండగ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం నిధులతో గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టి గ్రామాభివృద్ధిని సాకారం చేసేందుకే ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్‌రాజు, ఈవోఆర్‌డీ సుధాకర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు నిర్మల, సర్పంచి మునిభాస్కర్, తెదేపా నాయకులు దామోదర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ప్రభాకర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న తెదేపా నాయకులు

అభివృద్ధి పనులకు శ్రీకారం

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే : పీటీఎం మండలం మల్లెల తుమ్మరకుంట పంచాయతీల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా మల్లెల పంచాయతీలోని గొందిపల్లెలో రూ.6 లక్షలకు సంబంధించిన పనులు, తుమ్మరకుంట పంచాయతీలో రూ.57 లక్షలకు మంజూరైన పనులతో పాటు రూ.1.02కోట్లతో తారురోడ్డు పనికి భూమి పూజచేశారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ మునిరాజకుమార్, ఈజీఎస్ ఏపీడి మధుబాబు, ఇంచార్జి ఎంపీడీఓ యోగానంద్, జేఈ బాలచంద్రాచారి, ఏపీఓ తిరుపాలప్ప, పీఆర్ జేఈ నిరంజన్‌రెడ్డి, సర్పంచులు శ్రీకంఠరెడ్డి, లోకేశ్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

పీలేరు గ్రామీణ : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం గూడరేవుపల్లె, జాండ్ల, మేళ్లచెరువు పంచాయతీల పరిధిలో అభివృద్ధి పనులకు అధికారులు భూమిపూజ నిర్వహించారు.

తుపానుతో అప్రమత్తంగా ఉండాలి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, విపత్తు నిర్వహణశాఖ హెచ్చరికల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా మదనపల్లె డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు మండలంలో, గ్రామాల్లో రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండాలని, డివిజన్ కేంద్రానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు.


బాహుదాను సందర్శించిన తహసీల్దారు ధనుంజయులు, ఏఈ శ్రీహరిరెడ్డి

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే : తుపాను నేపథ్యంలో మూడు రోజుల పాటు విపరీతంగా వర్షాలు కురుస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు ధనుంజయులు సూచించారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14 నుంచి 17 వరకు తుపాను ధాటికి ఉరుములతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున గొర్రెలు, పశువుల కాపరులు చెట్ల కింద ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. ఏర్లు, వాగులు, వంకలు దాటే క్రమంలో నీటి పరిధి గమనించి దాటాలన్నారు. విద్యుత్తు స్తంభాల వద్ద స్టే వైర్లు తాకకుండా దూరంగా ఉండాలన్నారు. మండలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తగా ఉండాలని అధికారులకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు సూచించినట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిమ్మనపల్లె తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆర్ఐ రాంప్రసాద్, బాహుదా ఏఈ శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

గుర్రంకొండ : రానున్న 48 గంటల పాటు వర్షాలు అధికంగా కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శ్రీనివాసులు సోమవారం సూచించారు. వృక్షాలు, రేకుల షెడ్లు, లోతట్టు ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదన్నారు. ఇబ్బందులు ఎదురైతే వెంటనే తహసీల్దారు కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. చరవాణి సంఖ్య 94910 770625కు సమాచారం ఇవ్వాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు అందుబాటులో ఉండాలని సూచించారు.

బీరువాలు ధ్వంసం చేసి నగల అపహరణ

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : కుటుంబం విదేశాలకు వెళ్లిందని తెలుసుకున్న దుండగలు ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన వాల్మీకిపురం పట్టణంలోని తిరుచుట్టు వీధిలో చోటు చేసుకుంది. తిరుచుట్టు వీధికి చెందిన సుధీర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి నెలరోజుల కిందట విదేశాలకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగలు సుధీర్‌రెడ్డి ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలు, అల్మారాలు ధ్వంసం చేసి వెండి వస్తువులతో పాటు బంగారు నగలతో పరారయ్యారు. విదేశాలకు వెళ్లిన సుధీర్‌రెడ్డి కుటుంబం స్వదేశానికి చేరుకుని సోమవారం వాల్మీకిపురంలోని ఇంటికి చేరుకున్నారు. ఇదే సమయంలో ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని గమనించిన సుధీర్‌రెడ్డి కుటుంబం స్థానిక ఎస్సై చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంట్లో ఏయే వస్తువులు చోరీకి గురైన విషయం తెలియాల్సి ఉంది. తెలిసిన వారే చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి తీవ్ర గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : వేర్వేరు ప్రమాదాల్లో పలువురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం కొండామారిపల్లె పంచాయతీ బెస్తపల్లెకు చెందిన సీతమ్మ (46) సోమవారం అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై మదనపల్లెకు వస్తుండగా బైపాస్‌రోడ్డులో వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో సీతమ్మ తీవ్రంగా గాయపడటంతో ఆమెను స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు. ● కడప మండలం చెన్నప్పరెడ్డిపల్లెకు చెందిన శివకాశిరెడ్డి (25) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఆయన సోమవారం ద్విచక్రవాహనంపై కడప నుంచి బెంగళూరుకు వెళ్తుండగా కురబలకోట మండలం చేనేతనగర్ వద్ద కారు ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన ఆయనను స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు విచారణ చేస్తున్నారు.

హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డులో ప్రమాదం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డులో సోమవారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో కర్ణాటకకు చెందిన ఇద్దరు పర్యాటకులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా బంగారుపేట తాలుకా కోడిగల్లు గ్రామానికి చెందిన ఎం.పవన్ కుమార్ (23) తన స్నేహితుడు భరత్ కుమార్‌తో కలిసి ద్విచక్రవాహనంలో హార్సిలీహిల్స్ సందర్శనకు బయలుదేరారు. ఘాట్‌రోడ్డు నాలుగో మలుపు వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో పవన్‌కుమార్, భరత్‌కుమార్ గాయపడ్డారు. క్షతగాత్రులను మదనపల్లెకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ప్రమీల సూచించారు. సోమవారం ఉదయం కమిషనర్ అధ్యక్షతన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

తెదేపాతోనే గ్రామాల అభివృద్ధి

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే) : తెదేపాతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెదేపా మండలాధ్యక్షురాలు గీతాంజలి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని యంవీపల్లె పంచాయతీ మేకలవారిపల్లెలో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.15 లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. నాయకులు శివారెడ్డి, వెంకట్రమణారెడ్డి, త్రినాథరెడ్డి, ఎంపీడీవో సుధాకర్, ఈవోఆర్డీ గఫూర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా... నడక సాగేదెలా?

రామసముద్రం : రామసముద్రం-చెంబకూరు ప్రధాన రహదారిలోని మట్లవారిపల్లె ఉన్నత పాఠశాల ఎదురుగా రహదారిపై వాననీరు నిలిచి కుంటను తలపిస్తోంది. దీంతో ఈ దారిలో వెళ్లేందుకు వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై వాననీరు నిల్వ లేకుండా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయంపై మదనపల్లె ఆర్‌అండ్‌బీ ఏఈ బుర్రయ్యను వివరణ కోరగా రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామన్నారు.


మట్లవారిపల్లె ఉన్నతపాఠశాల ముందు నిలిచిన వాననీరు

మండల సర్వసభ్య సమావేశం నామమాత్రం

గుర్రంకొండ, న్యూస్‌టుడే : మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సోమేపల్లె సీతమ్మ అధ్యక్షతన, ఎంపీడీవో వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం నామమాత్రంగా జరిగింది. సర్పంచులు, ఎంపీటీసీలు సంతకాలు చేసి వెళ్లిపోయారు. తహసీల్దారు మాట్లాడుతూ.. భూసమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షాలకు ఉలవలు సాగు చేస్తే లాభసాటిగా ఉంటుందని ఏవో రత్నమ్మ తెలిపారు. నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయిస్తామని ఎంఈవో సురేంద్రబాబు పేర్కొన్నారు. మండలంలో అక్కడక్కడా తాగునీటి సమస్య ఉందని పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని ఏఈ లాల్‌స్వామి తెలిపారు.

యువతి ఆచూకీ లభ్యం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : మదనపల్లె పట్టణంలో గతనెల 29వ తేదీన కన్పించకుండా పోయిన యువతి ఆచూకీ లభ్యమైనట్లు ఒకటోపట్టణ సీఐ చాంద్‌బాషా తెలిపారు. రామసముద్రం మండలం పెద్దకురప్పల్లెకు చెందిన విద్యార్థిని కన్పించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో ఈ నెల 3న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేయగా యువతి అదే మండలం దిన్నెమీద హరిజనవాడకు చెందిన శ్రీనివాసులు (23) అనే వ్యక్తిని వివాహం చేసుకున్నట్లు తెలిసిందన్నారు. వీరిద్దరు పెద్దపంజాణి మండలం రాయలపేట వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో సోమవారం స్టేషన్‌కు తీసుకొచ్చి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచామన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

కలికిరి, న్యూస్‌టుడే : ఉపసర్పంచి, ఇద్దరు వార్డు సభ్యులకు మంగళవారం నుంచి బుధవారం వరకు రెండు రోజుల పాటు ఆర్‌జీయస్‌ఏ కార్యాచరణ ప్రణాళికపై మండల పరిషత్ సమావేశ భవనంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భానుమూర్తిరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

పీలేరు, న్యూస్‌టుడే : పీలేరు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కంభం సతీష్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు పీలేరు ఎంపీడీవో జి.శివకుమార్ సోమవారం తెలిపారు. సర్పంచిలు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

ఎమ్మెల్యే పర్యటన నేడు

గుర్రంకొండ, న్యూస్‌టుడే : మండలంలోని ఎల్లుట్లలో జరిగే మంగళవారం జరిగే పల్లె పండగ కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారని సర్పంచి సింగంశెట్టి లలిత సోమవారం తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తారన్నారు. ఈపసలవాండ్లపల్లెలో బోరుబావి తవ్వడానికి నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, తెదేపా నేతలు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పీలేరు, న్యూస్‌టుడే : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పీలేరు కన్యకాపరమేశ్వరి అమ్మవారు బంగారు పాదాలతో శ్రీవారాహిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు చంద్రశేఖరస్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారికి ఉయ్యాల సేవ నిర్వహించారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి ఊరేగింపు

కలకడ (న్యూస్‌టుడే) : కలకడ పరిధిలోని దేవలంపేటలో సోమవారం చౌడేశ్వరిదేవి ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని డీఎల్‌డీవో అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. మదనపల్లె డీఎల్‌డీవోగా పనిచేస్తున్న లక్ష్మీపతి జిల్లా కేంద్రం రాయచోటికి బదిలీపై వెళ్లారు. కర్నూలు జిల్లా డ్వామా పీడీగా పనిచేస్తున్న అమర్‌నాథరెడ్డి మదనపల్లె డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామ, వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాలు తనిఖీలు నిర్వహిస్తామని, ప్రజా సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూస్తామన్నారు.

మండల సర్వేయర్‌గా రెడ్డిశేఖర్‌బాబు : మదనపల్లె మండల సర్వేయర్‌గా రెడ్డిశేఖర్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యంను రాయచోటి కలెక్టరేట్‌కు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో గుర్రంకొండ మండల సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న రెడ్డిశేఖర్‌బాబును మదనపల్లెకు బదిలీ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

ఏపీఎంగా మధుశేఖర్‌బాబు బాధ్యతల స్వీకరణ

ములకలచెరువు, న్యూస్‌టుడే : ములకలచెరువు ఏపీఎంగా మధుశేఖర్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ములకలచెరువు ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న హరినాథ్ బదిలీపై పీటీఎంకు వెళ్లగా పెద్దమండ్యం ఏపీఎంగా పనిచేస్తున్న మధుశేఖర్ బాబు ములకలచెరువు ఏపీఎంగా బాధ్యతలు చేపట్టారు.

భూ వివాదాలపై ఫిర్యాదుల వెల్లువ

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : రెవెన్యూ సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఏవో పద్మావతమ్మ తెలిపారు. తుపాను కారణంగా సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసిన విషయం తెలిసిందే. మదనపల్లె సబ్‌కలెక్టర్‌కు కొందరు బాధితులు అర్జీలు తీసుకురావడంతో డీఏవో పద్మావతమ్మ వాటిని పరిశీలించారు. అక్టోబరు 17న వాల్మీకి జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. వాల్మీకులు కోల్పోయిన ఎస్టీ రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని, వాల్మీకులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ డీఏవోకు అర్జీ సమర్పించారు. ఆయనతో పాటు సంఘం నాయకులు జయసింహ, నరసింహులు, మంజునాథ్, జగన్నాథం, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు. భూ వివాదాలపై పలువురు అర్జీలు సమర్పించారు.


అర్జీలు స్వీకరిస్తున్న డీఏవో పద్మావతమ్మ

భూమి కోసం నకిలీ పట్టాలతో దౌర్జన్యం



నాకు గ్రామంలో 4.62 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దీనిపై వ్యవసాయ రుణాలు కూడా తీసుకున్నాను. కర్ణాటకకు చెందిన కొందరు నకిలీ పట్టాలు, పాసుపుస్తకం తీసుకొచ్చి ఆక్రమించుకున్నారు. నాపై దౌర్జన్యం చేస్తున్నారు. **- గోవిందు, చొక్కావాండ్లపల్లె**

ఇంటిని కబ్జా చేసే యత్నం



పట్టణంలోని సీటీయం రోడ్డులో 40 ఏళ్ల కిందట ఇళ్లు నిర్మించుకున్నాను. మాకు పట్టా ఉంది. ఇతరులు నకిలీ పట్టా తీసుకొచ్చి సగం ఇంటిని పడగొట్టేశారు. దీనిపై కలెక్టరు, ఎస్పీకి ఫిర్యాదు చేశాం. రెండేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో విచారించి న్యాయం చేయండి. **- సుప్రజ, సీటీయం రోడ్డు**

దస్త్రాల్లో మారిన పేరుతో ఇక్కట్లు



నేను కొనుగోలు చేసిన భూమికి సంబంధించి ఇతరుల పేరు నమోదు చేశారు. వేంపల్లె పంచాయతీ పరిధిలో వ్యవసాయ భూమి కొనుగోలు చేశాను. ఇందుకు సంబంధించి పాసు పుస్తకం ఇవ్వడం లేదు. మ్యూటేషన్ చేసేందుకు వెళ్లగా అందులో పేర్లు మారినట్లు తెలిసింది. దీనిపై విచారించి న్యాయం చేయండి. **- నారాయణ, జంగాలపల్లె**

అరటి రైతులు అప్రమత్తంగా ఉండాలి


అరటి రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గాలిలో తేమ శాతం ఎక్కువ ఉంటుందని దీని కారణంగా ఆరటి పంటలో ఆకుమచ్చ తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉంటుందని.. ఈ తెగుళ్లు వ్యాపించక ముందే నివారణ చర్యలు తీసుకోవాలని రాజంపేట ఉద్యాన శాఖ అధికారి సురేష్‌బాబు సూచించారు. రాజంపేట మండలం పోలి గ్రామంలో సోమవారం ఆయన సాగులో ఉన్న అరటి పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ పొలంలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతే సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు


మాట్లాడుతున్న ప్రాంతీయ కార్యాలయ డివిజనల్ మేనేజరు షఫీక్

సుండుపల్లి, న్యూస్‌టుడే: కెనరాబ్యాంకులో ఖాతాదారుల సేవలకే అధిక ప్రాధాన్యం ఉంటుందని ఆ బ్యాంకు ప్రాంతీయ డివిజనల్ మేనేజరు షఫీక్ పేర్కొన్నారు. స్థానిక బ్యాంకులో సోమవారం ఆయన ఖాతాదారులతో సమావేశమయ్యారు. బ్యాంకు ఏర్పాటు ఖాతాదారుల సేవల కోసమేనని ప్రజలకు వివిధ రూపాలలో అందిస్తున్న సేవలను వివరించారు. ప్రధానమంత్రి జీవన్ బీమా, సుకన్య, పీపీఎఫ్, మహిళా ఖాతాదారులకు ఉన్న ప్రత్యేక ఖాతాలు, ప్రయోజనాలు, యువతకు, విద్యార్థులకు ఉన్న ప్రత్యేక ఖాతాల వివరాలను తెలియజేశారు. సుండుపల్లిలో ప్రజలకు ఏటీఎం, నగదు జమ యంత్రాల సేవలు అందుబాటులో ఉంచామన్నారు. సుండుపల్లి శాఖ మేనేజరు మస్తాన్, ఖాతాదారులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 7981695235

స్పందనకు వందనం

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని కె.రామాపురం లాయర్ నాగిరెడ్డి వీధిలోని ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. ఈ సమస్యపై ఈ నెల 10న మేమున్నాం...మీకు తోడుగాలో చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తనిల్వలు తొలగించారు.

వీరబల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని రాజీవీధిలో విద్యుత్తు దీపం మరమ్మతులకు గురైంది. ఈ విషయమై మేమున్నాం మీకు తోడు శీర్షికన వార్త ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, విద్యుత్తు శాఖ సిబ్బందితో కలిసి సోమవారం మరమ్మతులు చేసి పునరుద్ధరించారు.

సుండుపల్లి, న్యూస్‌టుడే: సుండుపల్లి బాలాజీనగర్‌లోని మలుపులో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈ విషయమై మేమున్నాం మీకుతోడులో ఈ నెల 11న చెత్త తొలగించండి శీర్షికతో చిత్ర కథనం ప్రచురితమైంది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

?: ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం శుభ్రం చేయకపోవడంతో అపరిశుభ్రంగా తయారైంది. వారం రోజులుగా హరితరాయబారులు రాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. **- స్థానికులు, వీరబల్లి**

✓: వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పరిసరాలను శుభ్రం చేయిస్తాం. **- వరప్రసాద్, కార్యదర్శి** **-న్యూస్‌టుడే, వీరబల్లి**

తాగునీటి మోటారు మరమ్మతు చేయండి

?: మండలంలోని కొత్తజంగంపల్లిలో రక్షిత నీటి పథకం మోటారు అయిదు రోజుల కిందట మరమ్మతులకు గురైంది. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. **- సి.వెంకట్రామరాజు, కొత్తజంగంపల్లి**

✓: మోటారుకు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం. **- ఎస్.మహమ్మద్ షరీఫ్, సర్పంచి, రాయవరం**
-న్యూస్‌టుడే, సుండుపల్లి

పల్లె విద్యార్థులు.. ఆటల్లో మెరికలు

❖ రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా ❖ క్రీడల్లో ఆదర్శం ప్రభుత్వ పాఠశాలలు

– న్యూస్‌టుడే, రామాపురం

వారంతా గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు. ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటూనే క్రీడల్లోపై ఉన్న ఆసక్తితో మేటిగా నిలుస్తున్నారు. నియోజకవర్గ, జిల్లా స్థాయి క్రీడల్లో రాణించి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. జాతీయ స్థాయి క్రీడల్లో రాణించేందుకు సిద్ధమతున్నారు. ఓ వైపు చదువులో రాణిస్తూనే క్రీడల్లో సత్తా చాటుతున్న విద్యార్థుల మనోగతంపై కథనం.


త్రోబాల్ విజయం సాధించిన నీలకంఠరావుపేట విద్యార్థులు

జాతీయ స్థాయిలో రాణిస్తా



చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఎంతో ఆసక్తి. ఓ వైపు చదువులో రాణిస్తూనే వ్యాయామ ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తున్నా. ఈ ఏడాది విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచా. భవిష్యత్తులో జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తా. **- హర్షవర్ధన్, తొమ్మిదో తరగతి, నీలకంఠరావుపేట**

అమ్మానాన్నల ప్రోత్సాహంతో..



ఆరో తరగతి నుంచి త్రోబాల్ క్రీడ అంటే ఆసక్తి ఏర్పడింది. వ్యాయామ ఉపాధ్యాయుడు నరేంద్రరెడ్డి సహకారంతో రోజూ పాఠశాలలో తరగతుల అనంతరం తోటి విద్యార్థులతో కలిసి ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నా. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. మా అమ్మానాన్నలు ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. **- నాగచైతన్య, నీలకంఠరావుపేట**

క్రీడా కోటాలో ఉద్యోగమే లక్ష్యం



కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచా. ప్రిన్సిపల్ పుష్పలత, వ్యాయామ ఉపాధ్యాయిని రమీజాల సహకారంతో ముందుకెళ్తున్నా. క్రీడల కోటలో ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నా. **- రెడ్డి కల్యాణి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, కస్తూర్బా పాఠశాల**

పోలీసు కొలువు సాధిస్తా



నేను కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నా. ఈ ఏడాది తిరుపతి, గుంటూరు జిల్లాలో నిర్వహించిన రగ్బీ, త్రోబాల్, స్కిప్పింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించా. మా అమ్మ నన్ను ఎంతగానో ప్రోత్సహిస్తూ క్రీడల వైపు నడిపిస్తోంది. పోలీసు అధికారి కావాలన్నదే లక్ష్యం. **- నిరవంజిత, ఇంటర్మీడియట్, కస్తూర్బా పాఠశాల**

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: అధికారులు పార్టీలకు అతీతంగా సమన్వయంతో పని చేసి మండలాభివృద్ధికి కృషి చేయాలని రవాణా, క్రీడలు, యువజన శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్తు సభా భవనంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. ముందుగా గ్రామస్థుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె మండలం గతంలో అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడి ఉందని ఇక్కడున్న అధికారులు రాజకీయాలకు అతీతంగా పని చేయాలన్నారు. జిల్లా కేంద్రం ఏర్పడినప్పటికీ మౌలిక వసతులు సరిగ్గా లేవన్నారు. త్వరలో ప్రతి కార్యాలయానికి అన్ని వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో ఆరు మండలాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో నూతనంగా బోర్లు వేసి పరిష్కరించామన్నారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులతో కలిసి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి మంత్రిని సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీప్రసన్న, ఎంపీడీవో రెడ్డెన్న, తెదేపా మండల నాయకుడు యనమల మదన్‌మోహన్, డాక్టర్ షఫీనాయక్, మల్లి, జెకె రెడ్డి, చీర్ల సుధాకర్ యాదవ్, అబ్బవరం మల్ రెడ్డి, భోజనపు రామకృష్ణ, నసీరుద్దీన్, ముక్తార్, బషీర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పక్కన అధికారులు

రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, తెదేపా నియోజకవర్గ బాధ్యుడు ముక్కా రూపానందరెడ్డి, అధికారులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్తకోడూరు, లక్ష్మీ ప్యారడైజ్ సినిమా హాలు ఎదురుగా ఉన్న ప్రాంతాలకు సిమెంటు రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ తెదేపా బాధ్యుడు ముక్కా రూపానందరెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా రూ. 45 లక్షల వ్యయంతో 900 మీటర్ల సిమెంటు దారులు నిర్మిస్తున్నట్లు పంచాయతీరాజ్ శాఖ డీఈ బాలనరసింహులు, ఎంపీడీవో నాగార్జున తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాలను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, గ్రామీణ ప్రాంతాలకు రహదారుల వసతి కల్పిస్తామని ఎమ్మెల్యే వివరించారు. రాష్ట్ర జనసేన ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, సర్పంచి బుడిగి శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న తుపాను ముప్పు

పలు చోట్ల భారీ వర్షాలు.. రహదారులు జలమయం

లోతట్టు ప్రాంతాలపై అధికారుల ప్రత్యేక దృష్టి

బయటకు వెళ్లొద్దని హెచ్చరిక


రాజంపేట పట్టణంలో వర్షానికి జలమయమైన ప్రధాన రహదారి

రాజంపేట, రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లో కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. పలు చోట్ల భారీవర్షం కురడంతో రహదారులు జలమయమయ్యాయి. మురుగు కాలువలు పొంగిపొర్లాయి. రాజంపేటలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షానికి రోడ్లన్నీ వాననీటితో నిండాయి. పట్టణంలోని కడప-తిరుపతి రహదారిలో తపాలా కార్యాలయం వద్ద, పట్టణ పోలీస్‌స్టేషన్, ఆర్టీసీ బస్టాండు, ర.భ.శాఖ కార్యాలయం తదతర ప్రాంతాల్లో రోడ్లపైకి కాలవుల్లోని మురుగు నీరు రోడ్లపైకి చేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

☆ మంగళ, బుధ, గురు వారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు ఎవరూ బయటకు వెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు. పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని సబ్‌కలెక్టర్ నైదియాదేవి ఓ ప్రకటనలో సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అందరూ అప్రమతంగా ఉండాలని, అక్కడక్కడా పిడుగులు పడే ప్రమాదం ఉందని ఆమె తెలిపారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సెల్‌ని ఏర్పాటు చేశామని 08565-240079 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆమె కోరారు.

☆ రైల్వేకోడూరులో ఓ మోస్తరు వర్షం కురిసింది. వేకువజాము నుంచే వర్షం కురవడంతో కడప-చెన్నై జాతీయ రహదారితోపాటు వీధులన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. నియోజకవర్గ పరిధిలో పంటలకు ఎక్కడా నష్టం వాటిల్లలేదని ఉద్యానశాఖ అధికారి భాస్కర్ వివరించారు.


పుల్లంగేరు వంతెనను పరిశీలిస్తున్న తహసీల్దారు అరవింద్ కిశోర్, ఆర్ఐ

పుల్లంపేట: మండల పరిధిలోని పుల్లంగేరుపై ఏర్పాటు చేసిన వంతెనల సమీపంలోని వారు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు అరవింద్ కిశోర్ పేర్కొన్నారు. మండలంలో కురుస్తున్న వర్షాలకు స్పందించిన ఆయన పుల్లంగేరు వంతెన, చెరువులను పరిశీలించి సమీప గ్రామస్థులను అప్రమత్తం చేశారు. ఆయన వెంట ఆర్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

తుపాను వేళ పంట కోతలు వద్దు

పెనగలూరు, సుండుపల్లి: తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు తమ పంటలను కోయవద్దని పెనగలూరు మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ తెలిపారు. పంట పొలాల్లో ఎక్కువ నీళ్లు నిలబడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంట ఎక్కువ తడిసినప్పటికీ ఉప్పు ద్రావణంతో పిచికారీ చేస్తే పంట దెబ్బతినకుండా కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. రానున్న రెండు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అప్రమత్తం చేయాలని సుండుపల్లి తహసీల్దారు దైవాదీనం, ఎంపీడీవో సుధాకరరెడ్డిలు వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేశారు. ప్రజలు వీలైనంత వరకు ప్రయాణాలు చేయకుండా ఉండాలని వారు కోరారు.

ఎన్నికల హామీ నెరవేర్చాలని వినతి

సుండుపల్లి, న్యూస్‌టుడే: వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని. . నెలకు రూ.పది వేల జీతం ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ వాలంటీర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి సోమవారం వారు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. రావాల్సిన జీతాల బకాయిలు చెల్లించాలని కోరారు.


ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వాలంటీర్లు

వెలిగల్లు నీరు మండలానికి అందించాలని వినతి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాలకు వెలిగల్లు నుంచి సాగు, తాగునీటిని అందించాలని సీపీఐ జిల్లా నాయకుడు ఎం.అంకన్న కోరారు. లక్కిరెడ్డిపల్లెకు విచ్చేసిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని పరిష్కారం చూపాలన్నారు. దప్పేపల్లె పంచాయతీ జాండ్రపల్లెలో ఉన్నత పాఠశాల నడుస్తోందని ఆ పాఠశాలకు అనుసంధానంగా ఒక వసతిగృహాన్ని నిర్మించాలన్నారు. పీడీఎస్‌యూ జిల్లా నాయకులు స్వరూప్, తేజ, మహేష్ పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో ఘనంగా పల్లకీ ఉత్సవం

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలో వెలసిన శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఉప ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. ప్రధాన ఆలయంలోని వీరభద్రస్వామి, భద్రకాళీదేవి అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. రాత్రి స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి పల్లకీపై ఆశీనులు చేశారు. ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

రామాలయానికి దూరంగా మద్యం దుకాణాలు పెట్టండి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఆంధ్రుల భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయానికి సమీపంలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయరాదని సీఎం నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలకు సోమవారం వినతిపత్రం పంపినట్లు తెదేపా మండల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బొబ్బిలిరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి రెండు కి.మీ దూరంలో దుకాణం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

హోంగార్డుకు తీవ్ర గాయాలు

చిట్వేలి(పుల్లంపేట), న్యూస్‌టుడే: కుక్క అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడటంతో ఓ హోంగార్డు తీవ్రంగా గాయపడ్డారు. చిట్వేలి ఎస్సై రఘురాం తెలిపిన వివరాల ప్రకారం.. చిట్వేలి మండలం మల్లెంపల్లె గ్రామానికి చెందిన ఈయన ఓబులవారిపల్లె పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం విధులకు హాజరయ్యేందుకు వెళ్తూ మార్గ మధ్యలో కె.కందులవారిపల్లె వద్ద కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి కింద పడి గాయపడ్డారు. తిరుపతిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించామని పోలీసులు వివరించారు.

చేపల లోడుతో వెళ్తున్న వాహనం బోల్తా

సంబేపల్లె(రాయచోటి), న్యూస్‌టుడే: సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామ సమీపంలో సోమవారం చేపల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం బోల్తా పడింది. చిత్తూరు నుంచి చేపల లోడుతో కడపకు వెళ్తుండగా వాహన టైరు పంక్చర్ కావడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. డ్రైవరు స్వల్పంగా గాయపడ్డారని పేర్కొన్నారు. .

ఇరువర్గాల ఘర్షణ

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం ఒడ్డుపల్లి చెందిన రెడ్డెయ్యకు అదే గ్రామానికి చెందిన చిన్నరామయ్య, వెంకటకృష్ణకుమార్, సుదర్శన్‌ల మధ్య నాలుగు రోజుల కిందట ఘర్షణ జరిగినట్లు మన్నూరు పోలీసులు తెలిపారు. ఒడ్డుపల్లి గ్రామంలో ఇటీవల ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్‌ను ఆటో ఢీకొట్టడంతో అది పగిలిపోవడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. వారిలో రెడ్డెయ్యకు తీవ్ర గాయాలు కావడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశామని పోలీసులు వివరించారు.

కోడి వివాదం.. కేసు నమోదు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఆకేపాడు పంచాయతీ తిప్పరాజుపల్లికి చెందిన రామకృష్ణయ్యను రాజా అనే వ్యక్తి కర్రతో దాడి చేసినట్లు సోమవారం ఫిర్యాదు అందిందని సీఐ రామాంజనేయులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాకు చెందిన కొన్ని కోళ్లను రామకృష్ణయ్య కోయించి తన బంధువులకు ఇంటికి పిలిపించి పార్టీ ఇచ్చాడనే కారణంతో రాజా అతనిపై కర్రతో దాడి చేయడంతో ఆయన గాయపడ్డారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

ఈ కల్వర్టులకు మోక్షమెప్పుడో?

✴ తాత్కాలిక మరమ్మతులకు నోచుకోని వైనం
✴ వంగిమల్ల పంచాయతీ ప్రజలకు తప్పని తిప్పలు

వీరబల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మాండవ్య నదిపై గతంలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టుకు మోక్షం ఎప్పుడు లభిస్తుందోనని సమీప గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. కనీసం తాత్కాలిక మరమ్మతులకు కూడా నోచుకోవట్లేదని వాపోతున్నారు.

☆ గంగనేరుపై రెండేళ్లకు ముందు కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు పూర్తిగా దెబ్బతింది. కనీసం ఆ మార్గంపై తాత్కాలిక మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. దాంతో వంగిమల్ల గ్రామాల ప్రజలు చుట్టూ ఇతర మార్గాల ద్వారా మండల కేంద్రానికి రావాల్సి ఉంది. వీరబల్లి-రాగిమానుదిన్నెపల్లెకు వెళ్లే దారిలో మాండవ్యపై కల్వర్టు దెబ్బతినడంతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. ఆ దారిలో వాహనాలు అధికంగా తిరగడం, జేసీబీతో సమీపంలోనే ఇసుక తరలించడంతో కల్వర్టుపై భారీ గుంతలు ఏర్పడి వర్షమొస్తే కొట్టుకుపోయేంత ప్రమాదకరంగా మారింది. మట్లి కోదండరామాలయం వద్ద ఉన్న మాండవ్యనదిపై కల్వర్టు, ఒదివీడు సమీపంలో మాండవ్యనదిపై ఉన్న కల్వర్టులు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అటు వైపు ఉన్న గ్రామాల ప్రజలు రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వంలోనైనా శాశ్వత కట్టడానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజుల కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామచంద్రారెడ్డిని వివరణ కోరగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.


వంగిమళ్ల-వీరబల్లి మార్గంలోని గంగనేరుపై దెబ్బతిన్న కల్వర్టు


మాండవ్యపై కూలేందుకు సిద్ధంగా తాత్కాలిక కల్వర్టు

తవ్వేశారు.. వదిలేశారు

✦ పురపాలికలో అడుగడునా గోతులు ✦ ప్రయాణికులకు తప్పని తిప్పలు


గాలివీడు మార్గంలో కేబుల్ ఏర్పాటుకు తవ్వేశారిలా...

– న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

రాయచోటి పురపాలక పరిధిలో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. గుంతలతో నిండి రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు, వాహనాలు రద్దీ పెరగడంతో గుంతలు ఏర్పడ్డాయి. దీనికి తోడు నిర్వహణ లేమి అవస్థలు పెంచింది. తాగునీటి పైపులైన్లు, కుళాయి కనెక్షన్లు, భవన నిర్మాణదారులు, కేబుల్ పైపులు, ఇతర పనుల కోసం రహదారులను ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. అనంతరం గోతులు పూడ్చకుండా వదిలేస్తున్నారు. దీంతో అంతర్గత రహదారులపై వాహనాలు నడపాలంటేనే వాహనదారులు వణికిపోతున్నారు. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.


గాంధీ బజారుకు వెళ్లే మార్గంలో పైపులైన్ మరమ్మతులకు తవ్వేయడంతో ఏర్పడిన భారీ గుంత

✴ ప్రధానంగా గాలివీడు రోడ్డు, కొత్తపేట, కె.రామాపురం, ఎస్ఎన్ కాలనీ, బోస్‌నగర్, కొత్తపల్లె, రవిహాలు వెనుక ప్రాంతం, పాత రాయచోటి, డిస్ రెడ్డెన్న వీధి, సాయిరాం వీధి, చర్చి వీధి, బేతల్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఈ పరిస్థితి కనిపిస్తోంది. గత ప్రభుత్వ పాలకులు ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టించడంతో పురపాలక పరిధిలో రహదారుల అభివృద్ధికి నోచుకోలేదు.

✴ పురపాలక పరిధిలో 34 వార్డులు, సుమారు 31 వేల నివాసాలున్నాయి. లక్షా 20 వేల వరకు జనాభా ఉన్నారు. పురపాలక పరిధిలో 146 కిలో మీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 102 కి.మీ మాత్రమే నిర్మాణం చేపట్టారు. ఇంకా 44 కి.మీ మేర సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం... రహదారుల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటుండటంతో తమ ప్రాంత రోడ్లు సైతం బాగుపడతాయని పుర ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

రూ.2.18 కోట్ల ఆదాయం

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటం ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ పరిధిలో ఏర్పాటు చేయనున్న ఎనిమిది నూతన మద్యం దుకాణాల ద్వారా ప్రభుత్వానికి రూ. 2.18 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆ శాఖ సీఐ రాజశేఖర్ తెలిపారు. సిద్దవటం-5, ఒంటిమిట్ట-2, అట్లూరు-1 దుకాణాలకు మొత్తం 109 దరఖాస్తులు వచ్చాయని, సోమవారం లాటరీ పద్ధతిలో దుకాణదారులను ఎంపిక పూర్తయిందని చెప్పారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలో ఈనెల 14, 15, 16 తేదీలలో భారీ వర్షాలు పడుతున్న సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పోలీసు అధికారులు, విపత్తు నిర్వహణ శాఖ అధికారులు 24 గంటలకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. అతి భారీ వర్షాలు పడే ప్రాంతాలలో ప్రజలకు ముందస్తుగా సమాచారం ఇచ్చి వారిని అప్రమత్తం చేయాలన్నారు. అవసరమైన ప్రదేశాలలో సహాయక చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డులో ప్రమాదం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డులో సోమవారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో కర్ణాటకకు చెందిన ఇద్దరు పర్యాటకులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా బంగారుపేట తాలుకా కోడిగల్లు గ్రామానికి చెందిన ఎం.పవన్ కుమార్ (23) తన స్నేహితుడు భరత్‌కుమార్‌తో కలిసి ద్విచక్రవాహనంలో హార్సిలీ హిల్స్ సందర్శనకు బయలుదేరారు. ఘాట్‌రోడ్డు నాలుగో మలుపు వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో పవన్‌కుమార్, భరత్‌కుమార్ గాయపడ్డారు. క్షతగాత్రులను మదనపల్లెకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

పెనగలూరు, న్యూస్‌టుడే: పెనగలూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో వ్యాపారాలు చేసుకునే దుకాణదారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం బస్టాండ్ ప్రాంతంలో ఉండే ప్రతి దుకాణం వద్దకు వెళ్లి దుకాణ యజమానులకు సీసీ కెమెరాలు వలన కలిగే ఉపయోగాల గురించి వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై మల్లికార్జున వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.